# నెత్తురు కథ

చూచారా మీరు? అదిగో చూడండి! ఆ వీధి చివర మలుపులో_అక్కడ ఎఱ్ఱగా కన్పించడంలేదూ, గాలిలో రెప రెప లాడుతూ. ఆఁ అదే!

జాగ్రత్త! చెత్తా, చెదారమూనూ...ప్రక్కగా తప్పించుకుని నడవండి!

ఆఁ. అదే ఎఱ్ఱజండా.

సుత్తీ లేదు, కొడవలీ లేదు. నిజమే ! ఆ రంగు గూడానూ...రంగేసిన గుడ్డ కాదది. నెత్తురు పులుముకున్న గుడ్డ. నీలా, నాలా బ్రతికిన మనిషి నెత్తురు. ఒకప్పుడు—నీ రక్తంలా, నా రక్తంలా ప్రేమతో పొంగి, దుఃఖంతో కరిగి, క్షోభతో కుమిలి, కోపంతో మండి...న నెత్తురు.

ఆరక్తంలోనూ తెల్లకణాలు యీదినయి. ఆ రక్తంలో యెఱ్ఱకణాలు పరుగెత్తినయి.

ఎవరో పంచిపెట్టిన రక్తం గాదు అది. పొలం దున్ని, కాయకష్టం చేసి, పంటలు పండించి, సుఖంగా బ్రతికిన రైతులే ఆ రక్తానికి జీవం పోసింది; ఆ శరీరాన్ని పెంచింది. నీలా, నాలా_ఆ రక్తాన్ని సొంతం చేసుకున్న శరీరం ఊయలల్లో ఊగింది. తల్లి రొమ్ము పాలు తాగింది. తండ్రి ఒడిలో గంతులేసింది. మాయా మర్మమూ; కల్లా కపటమూ; తెలియ

కుండా రాత్రిళ్లు నిద్రపోయింది; రేపటి సంగతి తెలియకుండా వుత్సాహంతో వూగిపోయింది. సంతోషంతో కేరింతలు కొట్టింది. ఆనందంతో ఆటలాడి పాటలు పాడుకొంది—

పలకా బలపమూ పుచ్చుకొని బళ్లోకెళ్ళింది. పంతులు గారు బెత్తం ఝుళిపిస్తే గడ గడ వణకిపోయింది. పంతులు గారు పుస్తకం పట్టుకుంటే పాఠం గణగణ వప్పచెప్పింది.

పెళ్ళినాడు భర్త పేరు చెప్పేందుకు సిగ్గుతో వంగిపోయింది. చెరువులో నీళ్ళు తెచ్చేందుకు భర్త కావడేసుకుని, రొమ్ము విరుచుకుంటూ బయలుదేరితే వుబ్బితబ్బిబ్బయ్యింది.

నువ్వూ, నేనూ గాంధీగారి ఫోటో చూడకముందు తన యింట్లో గాంధీ పటాన్ని వ్రేలాడగట్టింది. రాములవారి పటాన్ని పూజించినట్లు పూజించింది.

నువ్వూ, నేనూ ఖద్దరంటూ వొకటుందని తెలుసుకోక పూర్వమే, రాట్నం వడికింది. ఇంటిల్లపాదీ ఖద్దరు కట్టేట్టు చేసింది.

నువ్వూ నేను చూడని జైళ్ళల్లోకి హత్యలు చేసిన వాళ్ళూ, దొంగతనాలు చేసినవాళ్లూ, వాళ్ళలాంటి వాళ్లూ వెళ్ళేప్పుడు భర్తచేతికి 'రాట్నం జండా' యిచ్చి, భర్త నుదుట కుంకమబొట్టు పెట్టి హారతిచ్చి, కళ్ళంట నీళ్ళు పెట్టుకోకుండా భర్తని జైలుగేటుదాకా సాగనంపి వచ్చింది.

ఆరేళ్ళు పెరిగిన కొడుకు "అమ్మా! నాన్నెప్పుడొస్తాడే?" అని అడిగి ఎక్కెక్కి యేడిస్తే ఆ రక్తం ఏమని సమాధానం చెప్పిందో తెలుసా? "యీ లాటేలు పుచ్చు

కున్నవాళ్ళ రాజ్యం పోయినపుడు వస్తారు బాబూ!" అని చెప్పింది. "తెల్లవాళ్ళ రాజ్యంపోయి మనవాళ్ళ రాజ్యం వచ్చినప్పుడు వస్తారు బాబూ!" అని చెప్పింది.

వరదలొచ్చి పంటలు పోతే, వెన్నంటుకున్న బిడ్డల కడుపులు చూచి కుమిలిపోయింది..."చౌరమ్మా! చౌరమ్మా! నేనన్నట్టు వొప్పుకుంటే నీ పొలమూ నీకు దక్కుతుంది, నీ బిడ్డలూ నీకు దక్కుతారు. లేకపోతే_" అని జబల్‌కర్ గుటకలు మింగుతుంటే, యీ రక్తం యేంచేసిందో తెలుసా? రోకలిబండ పుచ్చుకుని "ఛీ! చచ్చినాడా" అని జీవంలేని చేతులు వూపింది. పదునులేని పళ్ళు నూరింది. రక్తంలేని కళ్లు వురిమింది. పెగలని కంఠంతో ఇంకేమో మాట్లాడబోయి శోషొచ్చి కూలింది...

భర్త జైలునుండి బయటపడి వచ్చేప్పటికి పొలం పోయింది. ఇల్లు పోయింది. వళ్లు గుల్లయింది. అయినా— కళ్ళల్లో పెట్టుకున్న ప్రాణాలతో ఎదురెళ్ళింది. జరిగిందంతా విని భర్త నీరైపోతే యీ రక్తం యేమన్నదో తెలుసా? "అయిందేదో అయింది. ఇట్లాంటికాలం యిట్లాగే వుంటుందా? గాంధీబాబు స్వరాజ్యం తెస్తాడు. అప్పుడు యెవరి సొమ్ము వాళ్ళకే వస్తుంది" అన్నది. బొంబాయి వెళ్ళి యే మిల్లులో కుదిరినా మన మూడు డొక్కలూ నిండుతయ్ లే. దిగాలు పడకు!" అని దిటవు చెప్పింది. జీవంలేని నవ్వు నవ్వింది.

చిరుగులు కుట్టిన కోక కట్టుకుని కోడలు యింట్లో అడుగు పెడితే గుడ్ల నీళ్లు గుడ్లల్లో కుక్కుకొంది. కొంగుతో కళ్లు తుడుచుకుని, కోడలు గడ్డం పుచ్చు

కుని ఈ రక్తం ఏమన్నదో తెలుసా? "ఇట్లాంటి కాలం యిట్లాగే వుంటుందా? నీ కోడలు రాకముందే స్వరాజ్యం వస్తుంది, నీ కోడలు లంక్ష్మి దేవికిమల్లే వస్తుంది. నా మనవళ్ళు రాజులకి మల్లే బ్రతుకుతారు" అని అన్నది...

భర్త గుండెల్లో గుండు దూరిందని వార్త వచ్చింది. తన చేతుల్తో తనే సాగనంపింది భర్తను; "చారీ! జైలుకెళ్ళిన రోజులు గుర్తుకొ స్తున్నయ్యా" అంటే యీ రక్తం ఆనందంతో పరుగెత్తింది. "అప్పుడు నీ మొఖాన కుంకుం పెట్టాను. ఇప్పుడేం పెట్టి బొట్టుపెట్టను. కాండబ్బంత కుంకంకూడా లేకపోయె యింట్లో. హారతిమాట అనుకోడానికి గూడా..." అంటూ బేజారయిపోయింది యీ నెత్తురు. "పిచ్చిదానా...!" అంటూ భర్త తలమీద చేయివేసి నిమురుతుంటే చిన్నప్పుడు తండ్రి మోకాళ్ళమీద గుర్రంతొక్కుతూన్నట్లు వుబ్బి తబ్బిబ్బయ్యింది. ఆ మాటలన్నీ గుర్తుకొచ్చాయి.

అయినా పిండి నూరే చేతుల్లోకి ప్రవహించుతూనే వుంది యీ రక్తం. ఈ చేతులు నూరిన పిండి పెనంమీదికి యెక్కుతూనే వుంది. కాలిన చపాతీలు కాలేజి కుర్రాళ్లు బోటులోకి జేరవేస్తూనే వున్నారు. బోట్లు నీళ్ళల్లో నిలుచున్న ఓడలవైపుకు పరుగెత్తుతూనే వున్నవి. ఓడలలో వున్న నావికుల ప్రాణాలు నిలబడినై. ఎవరో "వాళ్ళందరూ గూండాలు" అన్నారని ఎవరో వచ్చి చెప్తితే యీ రక్తం నిండారులయ్యింది. "తెల్లొళ్ళైనా అన్నది!" అని వెర్రినవ్వు నవ్వింది యీ రక్తం. కోపంతో సలసల కాగిపోయింది యీ రక్తం...

మనవాళ్ళని చూచి మురిసిపోయింది యీ రక్తం. 'వచ్చేకాలం మీదేరా బాబూ!" అని గోరువెచ్చబడిందీ రక్తం.

మూడు రోజులు పస్తుండి ఆగస్టు పదిహేను పండుగ చేసుకొంది. మనమళ్ళతోనూ, కొడుకుతోనూ, కోడల్తోనూ పట్టణమంతా పిచ్చెత్తినట్లు తిరిగింది ఆనాడు. "అమ్మా! ఆవాళ్ళది రాట్నం జండా" ఈ వాళ్ళది చక్రం జండా" అని కొడుకంటే, చెప్పించని చదువు గుర్తుకొచ్చింది యీ రక్తానికి. రాట్నం జండా పుచ్చుకుని జైలు కటకటాల వెనక్కెళ్ళిన భర్త గుర్తుకొచ్చాడు యీ రక్తానికి.

నూలులేని బట్ట ఎక్కడుంటుంది? ఐనా తిండిలేని రక్తం ప్రవహిస్తూనే వుంది. తిండికోసం చీపురు పట్టింది, వీధు లూడ్చింది...

కలిగినవాళ్ళ బిడ్డలు తినిపారేసిన కాగితాల పొట్లా లూడ్చి గంపల కెత్తింది. మనమళ్ళ మాటన్నా తల్చుకో కుండా కొడుకు తోలే బండిలో గుమ్మరించింది. భవనాల్లో వుండేవాళ్ళకి జబ్బులు పుడతాయని భూమ్మీద పండుకుని ఆకాశాన్ని కప్పుకుని బ్రతుకుతూ భవనాలముందు దుమ్ము వూడ్చింది. వున్నవాళ్ళ కారుల టైరులు పోతాయని, కోడలి చేయి పుచ్చుకుని గుర్రాల బళ్ళు పారేసిన పేడకళ్ళెత్తింది యీ రక్తం!

ఈ బజార్లలో యీ చెత్తా, యీ చెదారమూ ఎందుకు పోగుపడిందో తెలుసా? వీటిని యెత్తిపారేసే చేతుల్లో రక్తం నీళ్ళైపోయింది. రక్తం నీళ్ళైపోయేప్పటికి

చేతులు 'పనిచేయం' అన్నాయి. కాళ్ళు 'కదలం' అన్నాయి. కళ్ళు 'చూడం' అన్నాయి. అన్నీ కలిసి 'రక్తం కావాలి' అని అరిసినవి...

కాగితాలమీద కలాలు నడిచినయి. కాగితాలు చేతుల్లో కదిలినయి. నలిగి, నలిగి, చిరిగిపోయినయి. చిరిగి పోయి చిత్తుబుట్టల్లోదూరినయి. అయినా 'రక్తం' కనిపించలా. చిత్తుబుట్టలు దులిపేందుకు కూడా కనబడకుండా పోయింది.

ఏమైపోయింది? ఎక్కడికి కెళ్ళిందీరక్తం? తెల్లోళ్ళ రాజ్యం పోయింది. మనోళ్ళ రాజ్యం వచ్చింది. నాన్న లేడు, కొంప లేదు, తిండి లేదు, బట్ట లేదు. జబలకర్ నెత్తిమీద గాంధీ టోపీ వుంది; జబల్‌కర్ ముడ్డికింద అస్సెంబ్లీ కుర్చీ వుంది. పోలీసోళ్ళ చేతుల్లో లాఠీల్లేవు. తుపాకులు వెలిసినయ్. అమ్మా, తెల్లోళ్ళ రాజ్యం పోయిందే! మనోళ్ళ రాజ్యం వచ్చిందే అమ్మా!" అని కొడుకంటూంటే 'విందాం' అని చెవుల్లో పరుగెత్తింది యీ రక్తం...

"అత్తా!...ఇంకెంతకాలం? సొరాజ్జం వచ్చింది. కోడలు రాలేదు. చిరుగులుపడ్డ కోకలో కోకపోయింది. ఇంకెంతకాల మత్తా?" అని కోడలు రక్తాన్ని కాండ్రిస్తే, 'అయ్యో' అని ఆదరా బాదరా కళ్ళల్లోకి పరుగెత్తిందా రక్తం.

"ఆ వూసిందిగూడా నువ్వే ఎత్తెయ్యాలి. పుయ్య బాక!" అని కొడుకు యెకిలినవ్వు నవ్వుతూంటే యేం చెయ్యాలో అర్థంగాక, యెటుపరుగెత్తాలో అర్థంకాక అట్లాగే నిలబడిపోయింద ఆ రక్తం.

అప్పుడా రక్తానికి ఏమీ తెలియలా. పట్టణంలో పట్ట కారోగ్యం పాడై పోతుందని విలపించే పత్రిక లున్నాయని తెలియలా. కాంగార్ మైదానంలో 'తిండి కావాలి' అని అరిసే గొంతులూ వినిపించలా. చీపుర్లుపట్టే చేతులు దుమ్మూ దుమారమూ దులుపుకున్న వనీ తెలియలా. పదమూడు వేల వంగిన నడుములు ఒక్కసారి లేచి నిలబడ్డాయని తెలియలా. బిడ్డా, పాపా, ఆడా, మగా అందరూ కలిసి బజారుల్లోకి వచ్చారనీ, యీసారి వచ్చింది చెత్తా చెదారమూ కదిపేందుకు కాదనీ, యీ సారి వచ్చింది వాళ్ళ నోళ్ళు అప్పు పుచ్చుకొని 'తిండి కావాలి.' అని అరిసే నాయకుల్ని పొట్ట పెట్టుకున్న రాతి గోడల్ని కదిపేందుకనీ తెలియలా...

ఎవరు సహిస్తారు యీ 'సోమరితనాన్ని?' 'పనిలేని జీతం' కావాలనేవాళ్ళనీ, 'జీతమున్న శలవులు కావాలనే వాళ్ళనీ'! నువ్వూ నేనూ సహించవచ్చు, సానుభూతి చూపవచ్చు, సమర్థించవచ్చు, బలపర్చవచ్చు. పోట్లాడవచ్చు...

శాంతి భద్రతలు మేల్కొన్నాయి. ఇంతవరకూ నిద్ర పోతున్న శాంతి భద్రతలు మేల్కొన్నాయి. ఒక్కసారి ఆవులించాయి. కబంధుడిలా ఒక్కసారి వళ్లు విరుచుకున్నాయి. తరువాత జరిగే సంగతి నీకూ తెలుసు, నాకూ తెలుసు! పోలీసుల చేతుల్లో తుపాకులు ఫెళఫెళ మన్నాయి. తుపాకుల బయట గుళ్లు బుంయ్‌మంటూ పరుగెత్తాయి. మనోవేగంతో పరుగెత్తాయి. రక్తాన్ని పలకరించబోయాయి.

ఏమీ తెలియని రక్తానికి అంతా అర్థమైంది. సలసలా కాగింది. జలజలా పారింది — వరండా తడిసింది. గుడ్డలు నానినయి ఆ రక్తంలో...

అదీ యీ రక్తం ! అలాంటిదీ–యీ రక్తం. ప్రేమతో పొంగి, దుఃఖంతో కరిగి, క్షోభతో కుమిలి, కోపంతో కుమిలి...న నెత్తురు !

ఆ రక్తంలోనూ తెల్లకణాలు యీదినయి, ఆ నెత్తురు లోనే ఎర్రకణాలూ పరుగెత్తినయి......

—:o:—